

# చైతన్యరాహిత్యంలో స్త్రీ

## – పవని నిర్మల ప్రభావతి

పధ్నాలుగేళ్ళు అరణ్య వాసం చెయ్యటానికి బయల్దేరిన సీతారాములను లక్ష్మణుడు అనుసరించినప్పుడు అతని అర్ధాంగి ఊర్మిళ, భర్తను అనుసరించలేకా, రాజాంతఃపురంలో జీవచ్ఛవంలా బ్రతకలేకా చైతన్య రాహిత్య స్థితిలోకి జారిపోయి దీర్ఘనిద్రను ఆశ్రయించింది.

ఆమెకా దుస్థితి కల్గించిన వారెవ్వరూ  ఆమె పట్ల జాలి చూపించ లేదు.

చరిత్ర కూడా ఆమె మానసిక పరిస్థితిని విశ్లేషించలేదు.ఈనాటి అధునాతన సమాజంలో కూడా ... పరిస్థితుల ప్రభావం వల్ల కొందరు స్త్రీలు ఎటువంటి చైతన్య రాహిత్య స్థితిని ఆశ్రయిస్తున్నారంటే అందుకు కారణం ఏమిటి?

మారుతున్న సమాజంలో కూడా స్త్రీలకు ఈ దుస్థితి తప్పక పోతే, ఇహ, అందరూ ఆశిస్తున్న 'మార్పు'కు అర్ధం ఏమిటి?

నేటి సాంఘిక సమస్యలను కథా వస్తువుగా తీసుకుని అతి హృద్యమంగా మలచిన శ్రీమతి పవని నిర్మల ప్రభావతి గారి రసవత్తర నవల "చైతన్య రాహిత్యంలో స్త్రీ"

ప్రతి ఒక్కరూ తప్పక చదివి తీరాల్సిన నవల ఇది.

*(గత సంచిక తరువాయి)*

కమల మధ్యతరగతి హైస్కూలు సైన్స్ మాస్టారు శ్రీహరిరావుగారి కూతురు. శ్రీహరిరావుగారికి ముగ్గురు కూతుళ్ళు. పెద్దమ్మాయి అమలకూ, రెండవ అమ్మాయి విమలకూ కొద్ది కొద్ది చదువుల తర్వాత, ఆ రోజుల తీరును బట్టి ఆడపిల్లలు రజస్వల అయ్యాక చదవకూడదన్న తన భార్య, తల్లిల వితండవాదానికి ఎదురీదలేక పెళ్ళిళ్ళు చేసాడు. ఇరవై ఏళ్ల వయసొచ్చే లోగా ముగ్గురేసి పిల్లలతో, ఈసురో మంటూ సంసారాలు ఈదుతున్న ఆ కూతుళ్ళని చూశాక ఇకాయనగారు తల్లి మాట, భార్య మాట వినదల్చు కోలేదు. కమలను ఆ అమ్మాయి ఎంతవరకూ చదువు కోవటానికి ఇష్టపడుతుందో, అందాకా తల తాకట్టు పెట్టి అయినా సరే చదివిస్తానని శపథం చేశారాయన. దానికి తగినట్లుగానే సమాజంలో, దేశంలో, మనుషులలో ఎన్నో మార్పులు అతి త్వరగా వచ్చేశాయి. ఆడపిల్ల చదువన్నది 'పెళ్లికో అదనపు అర్హత నుంచి, 'ఉద్యోగార్హత' అనే అవసరం దాకా వచ్చింది. ఉద్యోగం చేసే ఆడపిల్ల అయితే కట్నంలో 'కన్సెషన్'  కూడా ఉంటోంది. ఆడపిల్ల డిగ్రీ చదువు అన్నది ఇటు పుట్టింటికీ, అటు పెళ్ళయాక మెట్టినింటికీ ఆర్ధికావసరాలని ఆదుకునే 'మదుపుగా' మారి కూర్చుంది. ఆడపిల్లలు చదువుకోవటం, కాలేజీలలో చేరటం 'తప్పు' అనే భావం పోయి, 'తప్పని సరి'

అన్న ఆలోచన వచ్చేసింది. కమల స్కూల్ ఫైనల్ పాసయింది. సన్నగా, అందంగా తయారయింది. "కాలేజీలో చేర్చటానికి ఫీజు కడతాను కమలా! ఏ గ్రూప్ తీసుకుంటావో చెప్పు" అన్నారాయన ఆప్యాయంగా. కమల స్నేహితురాలు శాంతి, బాగా కలవాళ్ళమ్మాయి. ఒక్కర్తె కూతురు. ఇంట్లో ఆమె ఆడింది ఆట, పాడింది పాట. ఇద్దరు మగపిల్లల తర్వాత, ఇక శాంతి తల్లికి పిల్లలు పుట్టారని నిర్ణయించుకున్న తరుణంలో పుట్టిన శాంతి అంటే తండ్రి కేశవరావు గారికీ, తల్లి మీనాక్షమ్మకూ అపరిమితమైన ముద్దు. శాంతి చనువుగా కమల ఇంటికి వస్తుంటుంది. కమలా వెళ్తుంటుంది.

"ఏం గ్రూప్ తీసుకుందామంటావే శాంతీ?" అంది కమల శాంతితో. "హెచ్. ఇ. సి. తీసుకుందాం. నాకు హిస్టరీ, సివిక్స్ చాలా ఇష్టం. ఆ రెంటి కోసం ఎకనామిక్స్ భరిస్తాను" అంది శాంతి నవ్వుతూ. "నేనూ అదే తీసుకుంటాను" అంది కమల తండ్రితో.

శ్రీహరిరావు మనసులో నొచ్చుకున్నారు. బై.పి.సి. గ్రూప్ లో చేర్చాలని అనుకున్నారు ఆయనగారు. క్లాస్ తెచ్చుకుంటుందనీ, ఎం.బి.బి.యస్.లో చేర్పించి కూతురినో డాక్టరుగా చూడాలనీ ఉబలాట పడుతుండేవారాయన. శాంతి ఇంఫ్లుయన్సు కమల మీద చాలా వుందని ఆయనగారికి తెలుసు.

"పోనీ, శాంతి హెచ్.ఇ.సి. తీసుకుంటుంది. నువ్వు బై.పి.సి. తీసుకోమ్మా. సైన్స్ గ్రూప్ ఇంటరెస్టింగ్ గా వుంటుంది" అన్నారాయన మృదువుగా.

"వద్దు నాన్నా! అస్తమానూ బొమ్మలు గీయటం బోర్" అనేసింది కమల.

"ఔను బాబాయ్" అంది శాంతి.

శాంతి వెళ్ళిపోయాక కూడా నచ్చ చెప్పాలని చూశారు శ్రీహరిరావుగారు. "ఆ డాక్టరు కోర్సు నాకిష్టం లేదు నాన్నా. అస్తమానూ ఇంజక్షన్లు, కోతలూ, చీమూ, రక్తమూ" అంది జుగుప్స నిండిన కంఠస్వరంతో.

శ్రీహరిరావుగారు లాలనగా నవ్వారు. "అలాగంటావేమిటి తల్లీ! ఎదుటి మనిషికి బాధలో సాయం చేసే అవకాశం ఎందరికొస్తుంది? ఆ బాధను నివారించగలిగిన అర్హత, అవకాశం ఎందరికి లభ్యమౌతుంది? నువ్వు ఇంజక్షన్లు ఇచ్చేది పేషంటుకు జబ్బనొప్పి పుట్టడానికి కాదే? జబ్బు నయం కావటానికి. ఆ చీమూ, రక్తమూ, మకిలీ అవన్నీ మనందరిలోనూ వున్నాయి.

ఎదుటి వ్యక్తిలోని జబ్బు తొలగించి ఆరోగ్యాన్ని ప్రసాదించే వృత్తి ఎంత ఉన్నతమైనదో ఊహించుకోమ్మా.

నిజానికి నాకు నిన్నంత పెద్ద కోర్సు చదివించగల ఆర్ధిక స్తోమత లేదు. అయినా చదివిద్దామని పట్టుదలగా వున్నాను. ఎందుకంటావు? నువ్వో డాక్టరువై, ఎందరో రోగులకూ, దీనులకూ సేవ చేస్తూంటే చూచి, నిన్ను కన్నతండ్రిగా నా జన్మ ధన్యమైందనుకోవటానికి! అమలకూ, విమలకూ ఆ రోజుల్లో ఇంతటి అవకాశం లేకపోయాయి" అని చాలా దూరం నచ్చ చెప్పారాయనగారు.

కానీ కమల ససేమిరా అంది. శవాలన్నా, డిసెక్షన్ అన్నా తనకు చాలా కంపరమని చెప్పింది. సైన్సు గ్రూప్ తీసుకోగానే కప్పలను కొయ్యటం (డిసెక్షన్) లాటి ఉంటాయని, తలచుకుంటేనే తనకది గగుర్పాటు కలిగిస్తోందనీ గోల పెట్టింది. ఇక చేసేందుకేమీ లేక శ్రీహరిరావు గారు, "నీ ఇష్టం తల్లీ" అని ఊరుకున్నారు నిట్టూర్చి.

కమల, శాంతి కాలేజీలో చేరారు.

కాల ప్రవాహం గల గలా పారే సెలయేరులా సాగిపోతోంది. కాలేజీలో చేరేనాటి కమల వేరు. కాలేజీలో చేరాక రోజులు గడుస్తున్న కొద్దీ కమలలో చోటు చేసుకుంటున్న ఆలోచనలు వేరుగా వున్నాయి,

ఆ అమ్మాయి హృదయం స్వేచ్ఛా విహంగంలా మారింది. తను కట్టుకునే లాన్ చీటీ పరికిణీలు, వాయిల్ వోణీలు, ఒకటీ ఆరాగా వుండే ఆర్ట్ సిల్కు పరికిణీలూ చాలా ఎబ్బెట్టుగా, రోతగా వున్నట్లు అనిపించసాగాయి. శాంతి కట్టుకు వచ్చే ఖరీదయిన పట్టు పరికిణీలూ, జాకెట్లూ తనకు లేకపోయాయన్న దిగులు, అసంతృప్తి కొత్తగా ఏర్పడ్డాయి. అంతే కాదు. ఆర్ధికస్తోమత ఎక్కువగా లేకపోయినా ఇతర ఆడపిల్లలు కొందరు రంగు రంగుల సీతాకోక చిలుకల్లా రావటం ఆమెకు బాధాకరంగా వుంది.

ఆ నెలలో ఎప్పటిలాగానే శ్రీహరిరావు గారు కమల కోసం ఓ జత వోణీలు, పరికిణీ బట్టలూ, జాకెట్ పీసులూ తెచ్చినప్పుడు కమల అసంతృప్తిగా అంది.

"ఇవేం బాగా లేవు నాన్నా. మంచివిగా తీసుకుంటాను. నాలుగు జతల బట్టలు మంచివిగా వుండాలి నాకు. అందరూ ఎంత ట్రిమ్ గా తయారై వస్తారో తెలుసా కాలేజీకి?" అంది.

శ్రీహరిరావుగారు ఓ నిముషం గతుక్కుమన్నా, సర్దుకున్నారు. లోలోపల నవ్వుకున్నారు. ఈ వయసులో పెరుగుతున్న అందం వయసు పట్ల పిల్లలకి వో విధమైన గర్వం, కాన్ఫిడెన్స్ ఏర్పడతాయనీ, అందువల్ల తను చాలా ఆకర్షణీయంగా కన్పించాలనే భావం వుంటుందనీ గ్రహించ గలిగిన వివేకవంతుడాయన. కమలను నొప్పించటం ఇష్టం లేక అదనంగా మరో వంద రూపాయలు ఎక్కువపెట్టి కమల కోరిన బట్టలు కొనిచ్చారు.

కానీ మరో నాలుగు నెలలు తిరక్క ముందే కమల మరింత ఖరీదయిన బట్టల కోసం, మాంచి లేడీస్ వాచ్ కోసం రోల్డ్ గోల్డ్ చైన్ కోసం మారాం చేసినప్పుడు ఆయనగారు చాలా బాధపడ్డారు. కూతురు తన ఆర్థిక అంతస్తును మరచి ఎదిగి పోతున్నట్లు అనిపించింది.

"చూడమ్మా కమలా! నిన్ను నేను చదివిస్తున్నది కేవలం కాలక్షేపం కోసం కాదు. ఈ చదువు నీలో వివేకాన్నీ, విజ్ఞానాన్ని వృద్ధి చేసి, భవిష్యతులో నీకూ, నీ కుటుంబానికీ కూడా ఆర్థికంగా సాయం చేయడానికి ఉపకరించాలి. నీదైన వ్యక్తిత్వాన్ని, ఆత్మగౌరవాన్ని నిలుపుకోవటానికి ఉపయోగపడాలి. అందుక్కావాల్సింది యీ సమయంలో చదువు మీద శ్రద్ధ, దీక్ష. ఇదో తపస్సు లాటిది. శరీరానికి వ్యాయామం కలిగించే ఆటలు, కాలేజీలో జరిగే పోటీలలో పాల్గొనేందుకు నేనెలాటి అభ్యంతరం చెప్పను. కారణం అవీ చదువులో భాగాలే కాబట్టి.

కానీ మనం ధరించే బట్టలూ, నగలూ ఆడంబరమైన అలంకరణలు మాత్రమే. అవి మనకు గౌరవాన్ని, గొప్పనూ ఆపాదిస్తాయనుకోవటం పొరబాటు. ఇతరులను చూచి అనుకరించాలనుకోవటం అంతటి దీనత్వం మరొకటి లేదు. మన వ్యక్తిత్వాన్ని మనమే చంపుకోవటం అది. నువ్వెంతగా గొప్పవాళ్ళతోనో, గొప్పవాళ్ళలా నటించే వారితోనో పోటీ పడి అనుకరించినా, వాళ్ళతో సమానం కాలేక, నీలో బాధే మిగుల్చుకుంటావు. మన ఆర్థిక స్తోమతను అనుసరించి మనం నడుచుకోగలగటం, మన కోరికల్ని అదుపులో పెట్టుకోవటం తప్పనిసరి అమ్మా!"

శ్రీహరిరావుగారి యింత ఉపన్యాసమూ కమలలో ఓ విధమైన నిరాశనీ, కోపాన్నీ మాత్రమే మిగిల్చాయి.

"ఏమిటో ఈ చాలీ చాలని జీవితాలు, ఎప్పటికీ యిలా అసంతృప్తులతో, సర్దుకోవటంతో సాగిపోవలసిందేనా? బట్టల దగ్గిర్నుంచీ కోరికలను అణచుకోవలసిందేనా?" అని పదే పదే బాధ పడింది. నిజంగా వెనకటి కంటే ఖరీదయిన బట్టలే తను కట్టుకుంటున్నా, ఏదో కించ ఆమెని కృంగ దీస్తోంది.

ఆ రోజు శలవు. శాంతి ఇంటికి వెళ్ళింది కమల. ఎవరెవరో కొత్త బంధువులున్నారు. హాలులో అడుగెట్టే వరకూ కొత్తవాళ్ళను గమనించలేదు కమల. గమనించాక వెనక్కి వచ్చేద్దామనుకుంటున్నంతలో శాంతి నాన్నగారు అన్నారు. "మేడ మీదుందమ్మా శాంతి. ఫర్వాలేదు వెళ్ళు" అని. మామూలుగా అయితే చనువుగా వెళుతుంటుంది.

ఆ రోజు అలాగే వెళ్ళింది. శాంతి గది తలుపు ఓరవాకిలిగా వేసి వుంది. నెట్టుకు లోపలి వెళ్ళిన కమల ఒక్కసారిగా షాక్ తిన్నట్లు నిల్చుండి పోయింది. డ్రెస్సింగ్ టే బిల్ ముందు బాంబే డైయింగ్ పెద్ద పెద్ద పువ్వులున్న టవల్ చుట్టుక అటు తిరిగి కూర్చుని వున్నా ఆజానుబాహుడయిన యువకుడు ఆశ్చర్యంగా యిటువేపు చూశాడు. అంత క్రితమే షాంపూతో

తలస్నానం చేసి వచ్చాడల్లే వుంది. క్రాపు బాగా చెదిరి వుంది. తెల్లని విశాలమయిన వీపూ, ఎదా ఇంకా తడితడిగానే వున్నాయి. కళ్ళలో అనంతమయిన ఆకర్షణ ఏదో నిండి వుంది.

అతగాడూ అలాగే క్షణకాలం కమల కేసి రెప్ప వాల్చకుండా చూసాడు. సన్నగా, పొడుగ్గా, ఛామనఛాయలో రింగులు తిరిగిన పొట్టి జడలో ఆర్ట్ సిల్కు పరికిణీ, లేతరంగు వాయిల్ వోణీ, జాకెట్టులో వున్న ఈ అమ్మాయి ఎవరా! అనే ప్రశ్న కంటే, 'ఇంత చక్కటి కళ్ళు ఎందరాడపిల్లలకు వుంటాయి? ఈ కళ్ళలో ఎన్ని అద్భుత సౌందర్య లోకాలు దాగున్నాయి?' అనే ప్రశ్నలే నిండి వున్నాయి. కమల వెనుదిరగపోయింది, "శాంతి, శాంతీ" అంది తడబడుతూ.

అతగాడూ లేచి నిల్చున్నాడు తడబడినట్లు. "శాంతి... శాంతి కోసం వచ్చారా?" అన్నాడు

తలూపింది.

"పిలుస్తాను." అలా టవల్ తో నిల్చుని వుండటం అతగాడికి యిబ్బందిగా వుంది.

శాంతి రానే వచ్చింది. ట్రేలో రెండు కాఫీ కప్పులు పట్టుకుని. ఇద్దరినీ అలా చూచి క్షణ కాలం ఆశ్చర్య పడింది. ఆశ్చర్యాన్ని అణచుకుంటూ అంది. "ఎప్పుడు వచ్చావే కమలా?"

కమలకు ధైర్యం వచ్చింది. "ఇప్పుడే నీ కోసం. నువ్వు మేడ మీదున్నావని బాబాయిగారు చెబితే వచ్చాను." సంజాయిషీ చెబుతున్నట్లు అంది.

"అన్నట్లు ఈ 'టార్జాన్' ఎవరో నీకు తెలీలేదు కదా? పరిచయం చేస్తాను. మా బావ సుధీర్. బి.ఏ. బి,ఎల్. లాయరుగా ప్రాక్టీసు పెట్టలేదు. బిజినెస్ లో దిగిపోయాడు. హెడ్ క్వార్టర్సు మద్రాసా, హైదరాబాదా, బాంబేనా అన్నదింకా తేల్చుకోలేదు. అది సంప్రదించడానికే నాన్నగారితో మాట్లాడడానికి నిన్న రాత్రే వేంచేశారు" అంది శాంతి అతగాణ్ణి పరిచయం చేస్తూ గలగలా నవ్వుతూ.

"నమస్తే!" అంది కమల.

"నమస్కారం" అన్నాడు సుధీర్.

"బావా! పాపం చాలా ఇబ్బంది పడిపోతున్నావు. మేం కాస్సేపు బయట వుంటాం. నువ్వు త్వరగా డ్రెస్ చేసుకో. ఈ లోగా మరో కప్పు కాఫీ తెస్తాను కమలకు. ముగ్గురం తీసుకుందాం" అంది శాంతి.

"థాంక్సు! ఎలా చెప్పటమా అని ఆలోచిస్తున్నాను, ఇందాకటి నుంచీ" అన్నాడు సుధీర్ నవ్వుతూ.

శాంతి, కమల రూం బయటకు వచ్చారు. సుధీర్ రూం తలుపు వేసేసుకున్నాడు.

"నువ్విక్కడే ఉండవే కమలా! ఓ నిముషంలో వచ్చేస్తాను" అంటూనే మెట్లు దిగి పరిగెత్తింది శాంతి. ఈ కాసేపులోనే కమల ఒకటి గ్రహించింది. శాంతి రోజూ కంటే అందంగా, హుషారుగా వుందీరోజు. అలంకరణ కూడా చాలా ఓపిగ్గా, శ్రద్ధగా చేసుకున్నట్లు కనిపిస్తోంది. అసలే తెల్లగా, బొద్దుగా అందంగా వుండే శాతి సహజంగానే వుండే వాక్చాతుర్యంతో, గలగలా మాట్లాడే స్వభావంతో ఈ రోజు కొండల మీద నుంచి దూకే జలపాతంలా అద్భుతంగా కనిపిస్తోంది. శాంతికి ఇంత అందమైన బావ వున్నట్లు తెలీదు కమలకు ఇంతక్రితం.

సుధీరు చాలా అందంగా వున్నాడు. ఇందాక శాంతి అన్నట్లు 'టార్జాన్' లానే వున్నాడు. అలా శాంతి 'టార్జాన్' అంటే అతగాడేమనుకుంటాడో, నొచ్చుకుంటాడేమో అని అప్రయత్నంగా అతగాడి వేపు చూసింది తను. శాంతి అల్లరికి అతగాడు నొచ్చుకోలేదు సరికదా అల్లరిగా నవ్వుతున్నాయి అతగాడి కళ్ళు. ఆ కళ్ళ నవ్వులో ఎంత మెరుపు? ఎంతటి మైమరపు. బహుశా శాంతికీ అతగాడికీ త్వరలోనే పెళ్లి చేస్తారు కాబోలు.

"మీరు రూంలోకి రావచ్చు." రూం తలుపు తెరిచి సుధీర్ అంటున్న మాటలతో త్రుళ్ళిపడింది. అప్రయత్నంగా అతగాడి కేసి పరిశీలనగా చూచింది. తెల్లగా పైజామా, తెల్లని పాము కుబుసం లాటి సిల్కు లాల్చీ, లోపల ట్రేస్ లా కనిపిస్తున్న బనియను, చక్కగా దువ్వుకున్న కరల్డ్ క్రాఫ్.

"హమ్మయ్య! యువరాజాగారి డ్రెస్సింగు పూర్తయిందన్నమాట. పదవే కమలా రూంలోకి. నిన్నట్నుంచీ నా రూం తను ఆక్రమించేసుకున్నాడు మా బావ. ఇక మా నాన్నగారికి యెదురు చెప్పలేక వూరుకున్నాను గానీ... లేకపోతే ఈ దౌర్జన్యానికి ససేమిరా అంగీకరించేదాన్ని కాదు. ఏమైనా చెప్పవే కమలా. బిజినెస్ మాగ్నెట్స్ అంతా ఇంతరుల ఆస్తుల్ని కాజేసి కోటీశ్వరులు అవుతారను కుంటాను. ఈ గుత్త పెత్తందారీ వ్యవస్థ..."

గలగల మాట్లాడుతున్న శాంతి తలకో కప్పు కాఫీ యిచ్చి సోఫాలో కూర్చుంది.

"బాబోయ్! ఈ ధోరణి యెంత దారుణంగా వుంది శాంతీ! అన్నట్లు మీ పేరు కమల కదండీ. నిన్నట్నించీ మా శాంతి వాగుడుతో బుర్ర తిరిగి పోతోందే నాకు . రోజూ క్లాసులో మీరూ, మీ క్లాసుమేట్సు ఎలా భరిస్తున్నారండీ. మీ వోర్పుకు నా జోహార్లు" అన్నాడు సుధీర్ నవ్వుతూ.

అరగంట, గంట యెలా గడిచి పోయిందో తెలీలేదు కమలకు. శాంతి, సుధీర్ సరదాగా కబుర్లు చెబుతూంటే శ్రోతలా మిగిలి పోయింది.

మధ్య మధ్యలో “కదండీ కమలా!” అని సుధీర్, “కదుటే కమలా” అని శాంతో అంటున్నప్పుడు మాత్రం వాళ్ళిద్దరి మధ్యా తన ఉనికి సినిమాల్లో రాజకుమారి పాత్రధారిణి వెనకాల వుండే పదిమంది చెలికత్తెల్లో ఒకర్తి అయిన వో ఎక్స్ట్రా లా మాత్రమే తోచేది. శాంతిలో ఇంత క్రితం ఎన్నడూ చూడని అతి చైతన్యాన్ని చూస్తూ దిగ్భ్రాంతి పొందింది.

“నేనూ, బావ మార్నింగు షోకి వెళ్ళాలనుకుంటున్నాం. నువ్వూ వస్తావుటే కమలా?” అంది శాంతి హఠాత్తుగా.

అప్పుడు గానీ బాగా అర్థం కాలేదు కమలకు, ఇందాకట్నించీ శాంతి తనని ‘వదిలించుకోలేక’ మాత్రమే మాట్లాడుతోందని.

“రండి” అన్నాడు సుధీర్.

“ఊహుఁ. నేను రాను. మా అమ్మా నాన్నలకు చెప్పి రాలేదు. వెళ్ళొస్తా.” మెట్లు దిగి, బంగాళా దాటి రోడ్డు మీద నడుస్తూ పరధ్యానంలో పడిపోయింది కమల. తను రానన్నప్పుడు శాంతి ఆనందించింది. తను రావాలనీ పిలవలేదు. అసలు కాఫీ తీసుకోగానే తను వెళ్ళొస్తానని చెప్పి రావలసింది. సుధీర్ లోని ఏ బలవత్తర ఆకర్షణ శక్తో తనని సోఫాకి అంటుకు పోయేలా చేసింది. శాంతి చాలా అదృష్టవంతురాలు. బోలెడంత డబ్బుంది. ఒకే ఒక్క కూతురు. సుధీర్ లాంటి అందమూ, చదువూ, డబ్బూ వున్న బావ వున్నాడు. బనుశా అతగాడే భర్త కూడా కాబోతాడు, కానీ తనో!

ఈ రోజు శాంతి వెలిగిపోతోంది అప్సరసలా! తనూ. తన బట్టలూ... తన ఉనికీ కేవలం హీనంగా వున్నాయి. శాంతి స్నేహితురాలిగా చెప్పుకొనే స్థాయిలో కూడా లేవు. తనిటు వచ్చేశాక సుధీర్ ఏమని ఉంటాడు శాంతితో. “థాంక్ గాడ్! శని వదిలి పోయింది” అని ఉంటాడా? “నీ సర్వెంట్ మెయిడ్ అని చెప్పుకోవటానిక్కూడా పనికి రాని ఆ అమ్మాయి నీ కంతటి స్నేహితురాలేమిటి శాంతీ?” అని చిరాకు పడతాడా?

ఛ... తను శ్రీహరిరావు లాటి, సాధారణ స్కూలు టీచరు కూతురుగా గాక, కేశవరావుగారి లాటి కోటీశ్వరుడి కూతురుగా పుట్టి ఉండకూడదూ!

ఇంటికి వచ్చాక ఆ రోజంతా కమల అసంతృప్తితో వేగిపోతూనే వుంది. అనవసరంగా తల్లి మీద అయినదానికీ, కాని దానికీ చిరాకు పడింది. ఆమె కూర్చున్నా, నిల్చున్నా, పడుకున్నా సుధీర్ రూపం, మాటలు, నవ్వూ వెన్నాడుతున్నాయి. శాంతి నవ్వూ, జోక్స్, హుషారు పదే పదే గుర్తుకు వచ్చి బాధిస్తున్నాయి. ఏదో సన్నని ఈర్ష్యా జ్వాల హృదయంలో రేగి శరీరం, మనసూ అంతా ఆక్రమించి దహించి వేస్తున్నాయి.

వారం రోజులు శాంతి కాలేజికి రాలేదు. ఆ వారము ఆమె, సుధీర్ కలిసి సినిమాలకూ, షికార్లకూ వెళ్తున్నారని తెలుసు. ఓ రోజు శాంతి సుధీర్ కారులో వెళ్తూ, కాలేజి నుంచి వస్తున్న కమల ఎదురైతే కారు ఆపాడు సుధీర్. “నాకేమిటో

ఒంట్లో బావుండక, కాలేజికి రావటం లేదే కమలా! ఓ వారం పోయాక వస్తా. ఏం కొంప మునిగి పోయిందిలే. నోట్సు నువ్విస్తావు. హాజరు తక్కువైతే డాక్టర్ సర్టిఫికేట్ పెడతాలే" అంది శాంతి నవ్వుతూ అప్పుడక్కడ కారు ఆపటం శాంతికి అంతగా ఇష్టం లేదల్లే వుంది. ఆ హావభావాలు కనిపించకుండా జాగ్రత్త పడింది.

"ఒంట్లో బాగా లేదట, చూడండి ఈవిడగారికి. సినిమాలకు, షికార్లకు ఎంచక్కా తిరుగుతోంది! నన్ను సతాయించేస్తోంది ఇరవై నాలుగు గంటలూ. కాలేజికి డాక్టరు సర్టిఫికేట్ పెడుతుందట. రండి, ఎలాగూ మీ ఇంటి వైపున్న పార్కుకి వెడుతున్నాం. కాస్సేపు కూర్చుందురు గానీ. మిమ్మల్ని డ్రాప్ చేసి వెడతాం" అన్నాడు సుధీర్.

కమల తప్పనిసరిగా వెనక సీట్లో కూర్చుంది. పార్కులో శాంతి ముభావంగా కూర్చుంది. సుధీర్ తెగ మాట్లాడేశాడు. కమల కూడా బెరుకు వదిలి ఫ్రీగా మాట్లాడింది. శాంతిని మాట్లాడిస్తూనే కమల నాన్నగారి పేరూ, వృత్తి, అడ్రసూ కనుక్కున్నాడు సుధీర్. శాంతి మాటల్లో పెద్ద ఉత్సాహం లేదు. కమల ఉనికి పట్ల కోపం కూడా వుంది. ఈ మారెందుకో కమల తొణక లేదు. శాంతి అలా ఉడుకు మోత్తనంగా కూర్చుని వుంటే లోలోపల సంతోషం కలిగింది. సుధీర్ బొత్తిగా తనని 'తక్కువ అంతస్తు అమ్మాయి' గా తీసి పారెయ్యకుండా, ఎదురు పడినందుకు కనీస మర్యాద ప్రకటించి, ఓ 'చదువుకున్న అమ్మాయి' గా గౌరవించి, తమతో బాటు కారులో తీసుకువచ్చాడు. అంతవరకు చాలు!

చీకటి పడబోతుండగా శాంతి అంది. "నాకేమిటో తలనొప్పిగా వుంది బావా! ఇంటికెళ్దాం" అని .

కమల గ్రహించింది. "చీకటి పడుతోంది. మా అమ్మా నాన్న కంగారు పడుతుంటారు. వెళదాం. ఇక్కణ్ణించి దగ్గరే మా ఇల్లు. నడచి వెళతాను" అంది కమల.

"నడచి వెళ్ళటమెందుకండీ? అదేం మర్యాద? మేం పిలిచి, మిమ్మల్ని నడిపించటమా?" అన్నాడు సుధీర్.

శాంతి కంపరంగా చూచింది కమల వైపు. 'రోజూ ఈ మొహం కారులోనే వస్తోందా?' అన్న ఈసడింపు కనిపించిందా చూపుల్లో కమలకు.

"నడిపించట మేమిటండీ? మాకు కారు లేదు. రోజూ నడిచే వెళతాను. అయితే శాంతి పుణ్యమా అని అది మా ఇంటికి కారులో వచ్చి, నన్ను వెంటబెట్టుక బయల్దేరుతుంది. అంచేత వాహన యోగం పట్టోందే గానీ అప్పుడప్పుడు. లేకపోతే స్వతహాగా ఎంచక్కా నడుస్తాను" అంది కమల.

"నో... నో... మీరెన్ని చెప్పినా ఈ రోజు మిమ్మల్ని మీ ఇంటి దగ్గర డ్రాప్ చేయవలసిన బాధ్యత నాకుంది. మా వెంట రమ్మని పిలిచింది నేనే గనుక" అన్నాడు సుధీర్ ధృడంగా.

శాంతి చిరాగ్గా అంది. "దీనికింత చర్చేమిటి బావా? ఎలాగూ అటే కదా కారు వెళ్ళాలి, కమలని డ్రాప్ చేసి మరీ వెళదాం పద."

కారు కమల ఇంటి ముందు ఆగగానే... కమల అంది. "శాంతీ! ఒక్క నిమిషం మా ఇంట్లోకి రండే. కాఫీ తీసుకు వెడుదురు గానీ."

"ఇప్పుడేం కాఫీ?" శాంతి చిరాగ్గా అంది. సుధీర్ నవ్వాడు.

"పద. పిలిచి ప్రేమగా కాఫీ ఇస్తామంటే వద్దన్నవారికి రౌరవాది నరకాలు ప్రాప్తిస్తాయని కాఫీ పురాణం చెబుతోంది. సప్తవ్యసన వ్యాసులలో ఒకరైన కాఫీ వ్యాసుడెవరో వ్రాసి ఉంటాడా కాఫీ పురాణం. ఈ సూతుడు నీలాటి రౌరవాది... సారి శాంతాది మహా మునులకు బోధిస్తున్నాను. పద."

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

Post your comments